సాక్షి
నంద్యాల
శుక్రవారం। 24। జనవరి। 2025



నకిలీ సర్టిఫికెట్లు ..

కొందరు కేటుగాళ్లు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల దందాను యథేచ్ఛగా నడుపుతున్నారు. ఇందు కోసం ప్రభుత్వ అధికారుల సంతకాలు సైతం ఫోర్జరీ చేస్తున్నారు. -IIలో



మెరుగైన సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గురువారం సమీక్ష నిర్వహించారు. -IIలో



అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: 'ధర్మపథం'లో భాగంగా గురువారం శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీనివాస భజన బృంద సభ్యులు నిర్వహించిన భజన భక్తులను అలరించింది.

న్యూస్‌రీల్

మహిళా కౌలు రైతుకు జైవిక్ ఇండియా అవార్డు



అవార్డును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రకృతి సాగు, సేంద్రియ వ్యవసాయాన్ని చేపడుతున్న బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన మహిళా రైతు లతకు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. జిల్లా రైతు సాధికారత సంస్థ 2024 సంవత్సరానికి గానూ ఐదవ జైవిక్ ఇండియా అవార్డులో నామినేట్ అయిన మహిళా కౌలు రైతు లతకు ఈనెల 22న బెంగళూరులో అవార్డుతోపాటు రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. సంబంధిత బహుమతి మొత్తాన్ని ప్రకృతి వ్యవ సాయం కోసం వినియోగిస్తానని మహిళా కౌలు రైతు లత తెలిపారు. ఆరేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానన్నారు.ఒకటిన్నర ఎకరాలో ఏ గ్రేడ్ వరి, అర ఎకరాలో కూరగాయలు పండిస్తున్నా న్నారు. కాగా జైవిక్ అవార్డు సర్టిఫికెట్‌ను గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా అందుకున్నారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 855 అడుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నీటిమట్టం గురువారం సాయంత్రానికి 855 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 91.8290 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బుధవారం నుంచి గురువారం వరకు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 1.403 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి దిగువ నాగార్జునసాగర్‌కు 2,657 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,702, మల్యాల ఎత్తిపోతలకు 338, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన



కళాశాల పరిసరాలను పరిశీలిస్తున్న న్యాక్ అధికారులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జీవీఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) కోర్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ భగవత్‌సింగ్, కోఆర్డినేటర్ లాల్ నుందుంగ, సభ్యులు మకందర్ పర్యటించారు. గురువారం వీరు కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్ భారతితో సమావేశమై ఐదేళ్ల ప్రగతి నివేదికల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా కళాశాల పనితీరు, ఉత్తీర్ణత శాతం, ప్రవేశాల సంఖ్య, ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, విద్యార్థుల్లో సృజనాత్మక, సాంస్కృతిక కార్యక్రమాలు, వసతులు, అవకాశాలు తదితర అంశాలను రెండు రోజుల పాటు పరిశీలించి కళాశాలకు గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు సమాచారం.అందులో భాగంగా మొదటి రోజు కళాశాల అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రిన్సిపాల్ చూపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్‌సీసీ విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, గౌరవ వందనంతో పాటు కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదర్శ వ్యవస్థపై కూటమి కుట్ర

ప్రజలందరికీ ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారు. అప్పట్లో ఈ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. వివిధ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి మెచ్చుకున్నారు. అయితే రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. ఆదర్శ వ్యవస్థపై కుట్ర పన్నినట్లు విమర్శలు వస్తున్నాయి. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కుదింపు చేస్తుండటంతో పలు ఆరోపణలు ఉన్నాయి.



రుద్రవరం మండలంలోని చిన్నకంబలూరు గ్రామ సచివాలయం

- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు
- రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగుల కుదింపే లక్ష్యం
- ప్రస్తుతం ఒక్కో సచివాలయంలో 11 మంది సిబ్బంది
- 6 నుంచి 8 మందితో సరిపెట్టాలని యోచన
- మిగిలిన వారిని ఇతర శాఖలకు పంపేందుకు యత్నం

కర్నూలు(అర్బన్): హేతుబద్ధీకరణ పేరుతో సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలను ప్రారంభించింది. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులతో జాబ్‌చార్ట్‌లో లేని పనులను చేయిస్తూ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్న చంద్రబాబు ప్రభుత్వం తాజాగా ఉద్యోగుల కుదింపునకు శ్రీకారం చుడుతోంది. ఇందుకు ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయమే సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే జిల్లా వ్యాప్తంగా వందలాది మంది సచివాలయ ఉద్యోగులు ఇతర శాఖలకు బదిలీ కానున్నారు. కొత్తగా భర్తీ చేయాల్సిన పోస్టులకు కూడా మంగళం పాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఉద్యోగుల్లో ఆందోళన

జిల్లా వ్యాప్తంగా 1,188 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 885 గ్రామ, 303 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాల్లో మొత్తం 10,035 ఉద్యోగులు ఉండాలి. అయితే ప్రస్తుతం 8,066 మంది మాత్రమే విధులు నిర్వహిస్తుండగా, 1,969 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటి వరకు ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2,500 కంటే జనాభా తక్కువ ఉన్న గ్రామ సచివాలయాల్లో ఆరుగురు, 2,500 నుంచి 3,500 మధ్య జనాభా ఉండే సచివాలయాల్లో ఏడుగురు, 3,500కు పైబడి జనాభా ఉండే సచివాలయాల్లో ఎనిమిది మంది ప్రకారం ఉద్యోగులను కొనసాగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే ప్రతి సచివాలయంలో ఇద్దరు, ముగ్గురి ఉద్యోగాలకు ఎసరు పెడుతున్నట్లు తెలుస్తోంది. సగటున ఒక్కో సచివాలయం నుంచి ఎనిమిది మందిని లెక్కగట్టినా, 531 మందికి స్థాన చలనం కలగనుంది. వీరిని ఇతర శాఖలకు బదిలీ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సచివాలయల్లో ప్రస్తుతం ఉన్న ప్రత్యేక సెక్రటరీకి బదులుగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, పట్టణాల్లో వార్డు పరిపాలనా కార్యదర్శి హెడ్‌గా ఉంటారని ప్రభుత్వం చెబుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులకు అధిక ప్రాధాన్యత లభించేది. ప్రత్యేకంగా డిపార్టుమెంట్ పరీక్షలు నిర్వహించి అర్హత పొందిన వారికి పేస్కేల్స్ కూడా అమలు చేశారు. ఇప్పుడు తమ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో అని పేస్కేల్స్ పొందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పునరావృతం కానున్న పాత కష్టాలు

గ్రామ/వార్డు వ్యవస్థ ఆవిర్భావానికి ముందు మూడు, నాలుగు గ్రామాలకు ఒక్క పంచాయతీ కార్యదర్శి మాత్రమే ఉండేవారు. వ్యవసాయ అసిస్టెంట్లు ఎక్కడ ఉండేవారో తెలియని పరిస్థితి. తగినంతమంది సర్వేయర్లు లేకపోవడంతో పలు మండలాల్లో ఇన్‌చార్జ్ సర్వేయర్లతో ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న హేతుబద్ధీకరణ నిర్ణయంతో పాత రోజులు పునరావృతం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రేషనలైజేషన్‌తో కీలకమైన ఉద్యోగులు రెండు, మూడు గ్రామాలకు ఒకరు ప్రకారం పని చేయాల్సిన పరిస్థితులు మళ్లీ రానున్నాయి. గ్రామాల్లో సర్వేయర్ల సమస్య తీవ్రంగా వేధించే అవకాశం కూడా లేకపోలేదు.

సచివాలయ ఉద్యోగుల వివరాలు...

జిల్లా	సచివాలయాలు	మంజూరైన పోస్టులు	విధులు నిర్వహిస్తున్న వారు	ఖాళీలు
కర్నూలు	672	5,738	4,256	1,482
నంద్యాల	516	4,297	3,810	487
మొత్తం:	1188	10,035	8,066	1,969

మూడు కేటగిరీలుగా విభజన

హేతుబద్ధీకరణ పేరుతో సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించేందుకు చర్యలు చేపట్టనుంది. మల్టీపర్పస్, టెక్నికల్, ఆస్పిరేషనల్ ఫంక్షనీర్లుగా విభజించి, జనాభా ఆధారంగా వారిని సచివాలయాలకు కేటాయించేందుకు కార్యాచరణను సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, మహిళా పోలీసు మల్టీపర్పస్ ఫంక్షనీర్లుగా వ్యవహరించనున్నారు. అలాగే సచివాలయాల్లో కేటాయింపుల అనంతరం మిగిలిన ఉద్యో గాల్లో ఆస్పిరేషనల్ ఫంక్షనీర్లను ఎంపిక చేస్తారు. ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి ఆధునిక సాంకేతికతను ప్రజల్లోకి తీసుకొని వెళ్లే కార్యక్రమాలకు వీరిని వినియోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

పాలనా సంస్కరణలకు సమాధి!

గతంలో జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి సచివాలయ ఉద్యోగులను అత్యంత పారదర్శకంగా ఎంపిక చేశారు. మెరిట్‌కు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి ఎక్కడా పైరవీలకు తావు లేకుండా ఉద్యోగులను నియమించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొంది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఈ వ్యవస్థలో కీలకమైన వలంటీర్లను స్థానిక అధికారులు ఎంపిక చేశారు. వీరందరు సమష్టిగా ప్రజలకు విశేష సేవలను అందించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన పాలనా సంస్కరణలకు సమాధి కట్టే ప్రయత్నాలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న వలంటీర్లను తొలగించి, నేడు సచివాలయ వ్యవస్థను అస్తవ్యస్తం చేసేందుకు చర్యలు చేపడుతోంది.

1,969 పోస్టులకు మంగళం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో జీరో వేకెన్సీకి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. ఆయా శాఖల్లో ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 1,969 పోస్టుల భర్తీకి మూడో విడత నోటిఫికేషన్ జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియకు అప్పట్లో బ్రేకులు పడ్డాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న హేతుబద్ధీకరణ పూర్తి అయితే కొత్త పోస్టుల మాటెలా ఉన్నా, ఉన్న పోస్టులకు కూడా ఎసరు పెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

హేతుబద్ధీకరణ సమంజసం కాదు



గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను హేతుబద్ధీకరణ పేరుతో వేధించడం సమంజసం కాదు. ఈ వ్యవస్థ పూర్వపు పంచాయతీ సమితి వ్యవస్థకు అనుగుణంగా రూపొందించారు. అప్పటి సమితిల్లో ప్రజలకు అవసరమైన అన్ని శాఖలకు సంబంధించిన ఎనిమిది మంది అధికారులు పనిచేస్తుండే వారు. ప్రస్తుత గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ కూడా అలాంటిదే. హేతుబద్ధీకరణతో ఉద్యోగులను గందరగోళానికి గురి చేయడం తప్ప మరొకటి కాదు. రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వం పునరాలోచించాలి.

– జీ జయపాల్‌రెడ్డి, రిటైర్డు జెడ్పీ సీఈఓ

ఉత్తర్వులు అందలేదు



గ్రామ/వార్డు సచివాలయల్లోని ఉద్యోగుల హేతుబద్ధీకరణకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు అందితే నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– జీ నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

నష్టపరిహార పెంపును పరిశీలిస్తాం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జాతీయ రహదారి 340సిలో భూములు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహార పెంపును పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామస్తులు 49 మందికి చెందిన 20.26 ఎకరాలకు సంబంధించి నష్టపరిహార పెంపు అంశంపై పరిశీలిస్తామన్నారు. జాతీయ రహదారులు, భూ సేకరణ అధికారులు, సంబంధిత రైతుల నుంచి తీసుకున్న అంశాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకుంటామన్నారు. కోల్పోయిన స్ట్రక్చర్లు, దెబ్బతిన్న పంటలు, కమర్షియల్ పంటల వివరాలన్నీ తహసీల్దార్ నుంచి నివేదికలు తెప్పించుకుని పరిశీలిస్తామన్నారు. సమావేశంలో ఎన్‌హెచ్ తహసీల్దార్లు ఆల్‌ఫ్రెడ్, సువర్ణ, ఎన్‌హెచ్ అధికారులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా!

రుద్రవరం: అహోబిలేశుడి పారువేట ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ఆలమూరు గ్రామంలో పూజలందుకున్నారు. ఈసందర్భంగా ఆయా తేల్పుల వద్ద కొలువైన ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, లక్ష్మీనరసింహస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఊరంతా ఆడపడులు, అంగళ్లతో కిటకిటలాడుతోంది.



ఆలమూరులో పల్లకీలో భక్తులకు దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

ముగిసిన నంది బాలోత్సవాలు



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నంది బాలోత్సవాలు మార్గదర్శకంగా ఉండబోతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న నంది బాలోత్సవాలు గురువారంతో ముగిశాయి. విద్యార్థుల కేరింతలు, ఉత్సాహంతో బాలోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలోత్సవాలలో రెండో రోజు ఫ్యాన్సీ డ్రెస్సులు, క్లాసికల్ డ్యాన్స్, జానపద నృత్యం, దేశభక్తి, జానపద గీతాలు, కోలాటం, మట్టి బొమ్మలతయారీ, సెల్ఫీ, మ్యాప్, క్విజ్, తెలుగు, ఇంగ్లిష్‌లో ఉపన్యాసం, పద్యభావం తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రాంతిచైతన్యతో కలిసి డీఈఓ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నంది బాలోత్సవ కమిటీ నిర్వాహకులు రామరాజు, శంకరయ్య, మౌలాలి, భాస్కరరావు, లక్ష్మణ్, ప్రసాద్, గోపాల్, ఎంఆర్ నాయక్, రాజు పాల్గొన్నారు.

ఊరి బడికి ఉరితాడు!

- 117 జీఓను రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రద్దుకానున్న యూపీ స్కూళ్లు
- ఉర్దూ పాఠశాలలపై స్పష్టత కరువు
- ఉపాధ్యాయ పోస్టులు తగ్గే అవకాశం
- నూతన జీవోపై నేడు సమావేశం



కర్నూలులోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

కర్నూలు సిటీ: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ హయాంలో తీసుకొచ్చిన జీఓ నంబరు 117ను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటికే టోఫెల్ విధానాన్ని అమలు చేయడం లేదు. సీబీఎస్‌ఈ బోర్డు స్కూళ్లు రద్దు చేయడంతోపాటు ఐబీ విద్యను అటకెక్కించింది. స్కూల్ కాంప్లెక్స్‌ల విధానాన్ని రద్దు చేసి నూతనంగా క్లస్టర్ విధానాన్ని తీసుకొస్తున్నారు. కొత్త జీఓ తీసుకొచ్చేందుకు సన్నాహక సమావేశాన్ని శుక్రవారం కర్నూలులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఆర్జేడీ, డీఈఓలు, ఎంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలు హాజరుకానున్నారు. నూతన విధానంతో ఉపాధ్యాయ పోస్టులు తగ్గడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జీఓ 117 రద్దుతో ఇవీ కష్టాలు...

గ్రామాల్లో ఎప్పటి నుంచో స్పెషల్ స్కూల్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ పాఠశాలలు ఉన్నాయి. నూతన మార్గదర్శకాల ప్రకారం ఈ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 60కిపైగా ఉంటే మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చనున్నారు. దీంతో రెండు పాఠశాలలు రద్దు అవుతాయి. అలాగే ఎప్పటి నుంచో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలు సైతం వచ్చే ఏడాది నుంచి రద్దు కానున్నాయి.

➡ హైస్కూళ్లలో 75 మంది కంటే విద్యార్థులు తక్కువగా ఉంటే హెచ్‌ఎం, పీఈటీ పోస్టులు రద్దు కానున్నాయి. గతంలో 53 మందికి ఒక సెక్షన్, 54 నుంచి 88 మంది వరకు మరో సెక్షన్, 89 నుంచి 123 వరకు మూడో సెక్షన్ ఉంచి ఉపాధ్యాయులను నియమించారు. ప్రస్తుతం సెక్షన్లలో విద్యార్థుల సంఖ్యను పెంచనున్నారు. దీంతో జిల్లాలో హైస్కూళ్లలో వందలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగిలిపోయే అవకాశం ఉంది.

➡ కొత్తగా తీసుకొచ్చిన క్లస్టర్‌లో హెచ్‌ఎం స్థాయి విషయంలో స్పష్టత లేదు. ఒక క్లస్టర్ పరిధిలో రెండు, మూడు హైస్కూళ్లు ఉంటే వాటిలో పని చేస్తున్న హెచ్‌ఎంలకు సమాన స్థాయి ఉంటే క్లస్టర్ హెచ్‌ఎంతో ఏ మాత్రం పని చేస్తారనే విషయంపై స్పష్టత లేదు.

➡ 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలిపితే అక్కడ పని చేసే స్కూల్ అసిస్టెంట్ల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

➡ ఇకపై డీడీఓలుగా క్లస్టర్ హెచ్‌ఎంలకే అప్పగించనున్నారు. అదే జరిగితే ఎంఆర్‌సీ వ్యవస్థ బలహీనమైపోతుంది. ఇక ఎంఈఓలు నామమాత్రంగా మారే అవకాశం ఉంది. గత ప్రభుత్వం పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలనే ఉద్దేశంతో ఒక్క మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే ఎంఈఓ–2 పోస్టులు ఉంటాయా? రద్దు అవుతాయా? అనే విషయంపై అయోమయం నెలకొంది.

➡ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ అంటూ 2,645 టీచర్ పోస్టులను ప్రకటించారు. తాజాగా జీఓ 117 రద్దుతో డీఎస్సీలో ప్రకటించిన టీచర్ పోస్టులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

➡ కర్నూలు జిల్లాలో 96 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. 6, 7, 8 తరగతుల్లో 60 మందికి పైగా ఉంటే హైస్కూళ్లుగా 42 అప్‌గ్రేడ్ అవుతాయి. 30 మందికి తక్కువగా ఉంటే స్కూల్స్ 32, అలాగే 30 నుంచి 60 విద్యార్థులు స్కూళ్ల 42 ఉండగా అవి ప్రాథమిక పాఠశాలలుగా మారనున్నాయి.

➡ నంద్యాల జిల్లాలో 97 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 50 స్కూళ్లు హైస్కూళ్లుగా అప్ గ్రేడ్ కానున్నాయి. 30 నుంచి 60 మంది విద్యార్థులు ఉండే పాఠశాలలు 28 ఉన్నాయి. 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 19 ఉన్నాయి.

ఆధార్.. బేజారు!

- జిల్లాలో 24 వేల మంది చిన్నారులకు అందని ఆధార్ కార్డు
- తూతూ మంత్రంగా ఆధార్ కేంద్రాల ఏర్పాటు
- తల్లిదండ్రుల్లో కొరవడిన అవగాహన
- బర్త్ సర్టిఫికెట్ లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వయో వృద్ధుల వరకు ఎవరికైనా ఆధార్ నంబర్ అత్యంత కీలకం. పౌరుడిగా గుర్తింపు కోసం ఆధార్ కార్డునే పరిశీలనకు తీసుకుంటున్నారు. ఇంతటి విలువైన ఆధార్ కార్డును చిన్నారులకు అందజేయడంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డు నమోదుకు ప్రత్యేక కేంద్రాల పేరుతో హడావుడి చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు నీరుగార్చుతున్నారనే ఆరోపణలున్నాయి. తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం కూడా మరో కారణంగా తెలుస్తోంది.

– గోస్పాడు

జిల్లాలో 516 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో రూరల్ పరిధిలో 409 సచివాలయాలలో 81 ఆధార్ కేంద్రాలు, అర్బన్ ప్రాంతాల్లో 107 సచివాలయాల్లో 22 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 103 సచివాలయ ఆధార్ కేంద్రాలు ఏర్పాటుకాగా వాటిలో పూర్తిస్థాయిలో 58 మాత్రమే పనిచేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటిలోనూ పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ఆధార్ నమోదు నత్తనడకన సాగుతోంది. మరోవైపు గతంలో ప్రత్యేక అర్హతలతో నియమించుకుని, శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు కొన్నిచోట్ల బదిలీ కావడంతో ఖాళీ అయిన కేంద్రాల్లో ఆధార్ సేవలు అందడం లేదు. దీంతో స్థానికంగా ఉన్న సచివాలయం కాదని వేరేచోటుకు వెళ్లి తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. 1,663 అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన 1,23,949 మంది చిన్నారులతోపాటు జిల్లా మొత్తంగా 23,759 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు లేవు. ప్రతి చిన్నారికి ఆధార్ కార్డు తయారు చేయించే బాధ్యతను ప్రభుత్వం ఐసీడీఎస్ అధికారులకే అప్పగించింది. అందులో భాగంగానే ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధారు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అయితే వాటి పర్యవేక్షణను అధికారులు మరిచారు. ఆధార్ కార్డు ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలోనూ విఫలమయ్యారు. దీంతో ఎక్కువశాతం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ కార్డు తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. కొందరు ఆసక్తి చూపినా పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడం మరో సమస్యగా మారింది.



పసురపాడు గ్రామంలో చిన్నారికి ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

కొన్ని కేంద్రాలు పనిచేయడం లేదు



ఆధార్ నమోదు నిరంతరం ప్రక్రియ. సచివాలయాల్లో ప్రత్యే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. వాటిలో కొన్ని చోట్ల సాంకేతిక కారణాల వల్ల పని చేయడం లేదు. ఆయా కేంద్రాల పనితీరుపై ఉన్నతాధికారులకు తెలియజేశాం. వీలైనంత ఎక్కువ కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. సచివాలయాలతోపాటు కామన్ సర్వీసు సెంటర్లలోని 35 కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– శివారెడ్డి, డీఎల్‌డీఓ, నంద్యాల

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం



అంగన్‌వాడీ సెంటర్ స్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రతి చిన్నారికీ ఆధార్ కార్డు అందించేందుకు కృషి చేస్తాం. ఈనెలాఖరులోపు ఈ కార్యక్రమం పూర్తి చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, సీడీపీఓలను ఆదేశించాం. బర్త్ సర్టిఫికెట్లు లేనివారికి కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– నిర్మల, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, నంద్యాల

నిరాశాజనకంగా ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ధరలు నిరాశాజనకంగా ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సారి ఎండుమిర్చి ధర అధ్వానంగా ఉంది. గురువారం మార్కెట్‌కు 610 క్వింటాళ్ల ఎండుమిర్చి వచ్చింది. కనిష్ట ధర రూ.1,229, గరిష్ట ధర రూ.14,239 లభించగా.. సగటు ధర రూ.12,449 నమోదైంది. కనీసం క్వింటాలుకు రూ.20 వేల వరకు ధర లభిస్తే గిట్టుబాటు అవుతుందని రైతులు వాపోతున్నారు.

➡ వాము 394 క్వింటాళ్లు రాగా...కనిష్ట ధర రూ.2,469, గరిష్ట ధర రూ.21,288 లభించింది.

➡ ఉల్లి తాకిడి తగ్గిపోగా.. ధరలు పడిపోయాయి. మార్కెట్‌కు కేవలం 460 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.1,480, గరిష్ట ధర రూ.2,565 లభించింది.

➡ కందులు కనిష్ట ధర రూ.2,320, గరిష్ట ధర రూ.7,900 నమోదు లభించింది.

➡ కొర్ర, సజ్జ, మినుముల ధరలు కూడా నిరాశాజనకంగా ఉన్నాయి.

క్లుప్తంగా

మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు



ఏడీసీ, ఐఆర్ఎస్ అధికారులకు ప్రసాదాలు అందజేస్తున్న పండితులు

మహానంది: ఇన్‌కం ట్యాక్స్ నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల అడిషనల్ కమిషనర్ ఎన్.శ్రీకాంత్, హైదరాబాద్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి మంజుధర్ గురువారం మహానందిలో పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు స్వాగతం పలికారు. అనంతరం వారు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అధికారులకు స్వామి,అమ్మ వారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

వెంకటగిరిలో డీఎస్పీ విచారణ



వెంకటగిరిలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కోడుమూరు రూరల్: విద్యార్థులను వేధించిన ఉపాధ్యాయుడు లక్ష్మన్న కేసును పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, కోడుమూరు సీఐ తబ్రేజ్ వెంకటగిరి గ్రామానికి చేరుకుని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం కోడుమూరు పోలీస్‌స్టేషన్ చేరుకున్న డీఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఉపాధ్యాయుడిపై ఎస్సీ, ఎస్టీ, పాక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామన్నారు. కొందరి ఉపాధ్యాయుల వికృత చేష్టల వల్ల ఉపాధ్యాయ వృత్తికే కళంకం ఏర్పడుతుందన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై కూడా బాలికలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు.

రైస్ మిల్లును పరిశీలించిన అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పరిశ్రమ శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి

బనగానపల్లె రూరల్: బంకర్ కూలి బిహార్‌కు చెందిన కార్మికుడి దుర్మరణానికి, మరో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడటానికి కారణమైన రైస్ మిల్లును అధికారులు పరిశీలించారు. జిల్లా పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వై.నారాయణ రెడ్డి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ నజీరున్నీసా బేగం గురువారం రైస్ మిల్లు వద్దకు చేరుకుని కార్మికులు, యాజమాన్యంతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి పూర్తి నష్ట పరిహారం మిల్లు యాజమాన్యం ఇవ్వాలని, గాయపడిన మరో ఇద్దరి కార్మికులకు చికిత్స ఖర్చులను యాజమాన్యమే భరించాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశించారు. ఘటనపై విరాలు సేకరించామని పూర్తి స్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా పరిశ్రమశాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. వీరి ఉంట లేబర్ ఆఫీసర్ శోభ రాణి ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్లు పుట్టుకొస్తున్నాయ్..!

☛ కర్నూలు జిల్లా మొగతి గ్రామానికి చెందిన గొల్ల సరితకు గతేడాది నవంబర్ 5వ తేదీన ఒకటి, 2010లో మరో సర్టిఫికెట్ జారీ చేసినట్లుగా ఉంది. వీటిపై అనుమానం వచ్చిన యూఐడీఏఐ రీజనల్ కార్యాలయం(హైదరాబాద్) అధికారులు పరిశీలించాలని ఆసుపత్రికి పంపించారు. ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఈ సర్టిఫికెట్లు నకిలీగా తేలింది.

☛ నంద్యాలలోని చాకలిపేటకు చెందిన రాజ శివకుమార్ పేరుతో 2016 ఆగస్టు 5న జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లుగా ఉంది. ఇతని పేరుతోనే 2019 జూన్ 25న మరో సర్టిఫికెట్ జారీ చేశారు.

☛ ఆదోనిలోని మేకలబజార్‌కు చెందిన ఎస్‌కే షహీన్ బానుకు గతేడాది జులై 22న జనన ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఆమెకు పాస్‌పోర్ట్ జారీ చేసే అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలించి నకిలీదని అనుమానించారు. పరిశీలనకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పంపించారు.

☛ మరో సర్టిఫికెట్ కోసం ఏకంగా మధ్యప్రదేశ్ నుంచి అధికారులు పరిశీలనకు పంపించారు.

అయితే.. ఇవన్నీ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇవ్వలేదని, అన్నీ నకిలీ సర్టిఫికెట్లని తేలింది.

- యథేచ్ఛగా నకిలీ బర్త్ సర్టిఫికెట్ల దందా!
- కర్నూలు పెద్దాసుపత్రి అధికారుల సంతకాలు ఫోర్జరీ
- ఒకే పేరు మీద మూడు నాలుగు తయారీ
- పరిశీలనకు పంపుతున్న వివిధ శాఖల అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

కర్నూలు(హాస్పిటల్): జేబులో డబ్బులు తీసి ఇచ్చినంత సులభంగా కొందరు కేటుగాళ్లు నకిలీ జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు ప్రింట్ తీసి ఇచ్చేస్తున్నారు. ఇలా సర్టిఫికెట్ పొందిన వారు వాటిని వివిధ పనుల కోసం దుర్వినియోగం చేస్తున్నారు. ఇందు కోసం ఏకంగా ప్రభుత్వ అధికారుల సంతకాలు కూడా ఫోర్జరీ చేస్తున్నారు. ఏవి అసలో...ఏవి నకిలివో తెలియనంతగా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుండటంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఓ వ్యక్తి జనన ధ్రువీకరణ పత్రం కావాలంటే ఆ వ్యక్తి జన్మించిన ఆసుపత్రి నుంచి తీసుకోవచ్చు. లేదా సంబంధిత మున్సిపల్ కార్యాలయం లేదా పంచాయతీ కార్యాలయం/సచివాలయం ద్వారా దానిని తీసుకోవచ్చు. మరీ ఆలస్యమైతే మాత్రం తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల ద్వారా అవసరమైన పత్రాలు చూపి పొందవచ్చు. కానీ కొందరు సర్టిఫికెట్లను అక్రమార్కులకు ఉపయోగించేందుకు గాను దొడ్డిదారి వెతుకుతున్నారు. సరైన పత్రాలు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో నకిలీ సర్టిఫికెట్లు తీసుకోవడం కష్టమని గ్రహించి వాటిని తయారు చేసే వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. వారి కోరినంత మొత్తం చెల్లిస్తే చాలు నిమిషాల్లో అడిగిన సర్టిఫికెట్లు ప్రింట్ తీసి చేతిలో పెడుతున్నారు. జిల్లాలో ఇలాంటి వ్యక్తులు ఇటీవల బాగా పెరిగారు. కర్నూలు నగరంతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు లాంటి ప్రాంతాలతో పాటు పక్కనే ఉన్న తెలంగాణా రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతాల్లో నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చే వారు ఉన్నట్లు తెలుస్తోంది.





నకిలీ జనన ధ్రువీకరణ పత్రం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

పోలీసులకు చెప్పినా చర్యలు శూన్యం..!

గత ఆరేళ్ల క్రితంతో పాటు ఇటీవల వెలుగు చూస్తున్న నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల గురించి ఆసుపత్రి అధికారులు పోలీసుల దృష్టికి తీసుకెళ్తున్నారు. స్థానిక పోలీసులతో పాటు జిల్లా అధికారులకు చెప్పినా ఈ విషయంలో పెద్దగా స్పందించలేదని తెలుస్తోంది. దీనిపై కనీస విచారణ చేయలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయినా కూడా మళ్లీ ప్రస్తుత నకిలీ సర్టిఫికెట్ల గురించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆసుపత్రి అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావును వివరణ కోరగా ఇటీవల కొంత కాలంగా నా సంతకంతో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు పుట్టుకొస్తున్నాయని చెప్పారు. వివిధ శాఖల నుంచి వాటిని పరిశీలన కోసం తమ వద్దకు పంపిస్తున్నారని, వాటిని ఆన్‌లైన్‌లో పరిశీలించగా నకిలీవని తేలిందన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సీఎస్ఆర్ఎంవో సంతకాన్ని ఫోర్జరీ చేసి...

ఇటీవల కాలంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పేరుతో ఇచ్చినట్లుగా నకిలీ జన న ధ్రువీకరణ పత్రాలు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. వివిధ శాఖల నుంచి సర్టిఫికెట్లు పరిశీలించి చెప్పాలని ఆసుపత్రి కార్యాలయానికి పంపిస్తున్నారు. నెలరోజుల క్రితం ఏకంగా లోకాయుక్త నుంచి ఓ జనన ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను ఇలాగే పరిశీలించాలని పంపించారు. దానిని పరిశీలించగా నకిలీ సర్టిఫికెట్‌గా తేలింది. ఇలాంటివి నకిలీ సర్టిఫికెట్లు పుట్టగొడుగుల్లా బయటపడుతుండటంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. పైగా అన్ని సర్టిఫికెట్లలో సీఎస్ఆర్ఎంవో డిజిటల్ సిగ్నేచర్(సంతకం)ను ఫోర్జరీ చేసినట్లుగా ఉంది. ప్రస్తుత సీఎస్ఆర్ఎంవో మూడేళ్ల నుంచి మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అంతకుముందు కూడా ఇచ్చినట్లు సర్టిఫికెట్లలో ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేయడం గమనర్హాం. ఆరేళ్ల క్రితం సైతం ఆసుపత్రి కేంద్రంగానే కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐడీ, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి పెద్ద ఎత్తున నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. అప్పట్లో వారిని ఉద్యోగం నుంచి తొలగించారు. తాజాగా మళ్లీ నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతుండటంతో ఇవి ఎవరు తయారు చేస్తున్నారు. ఎక్కడ, ఎలా తయారు చేస్తున్నారని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఏం చేస్తున్నట్లు...!

నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు సృష్టించి వాటి ద్వారా పలు రకాల అక్రమాలకు ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా స్థానికతతో పాటు పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోవడం, ఆస్తుల విభజన, పంచుకోవడం, పలు రకాల పింఛన్లు పొందడం కోసం, పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను దక్కించుకోవడం కోసం, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ నమోదు ఇలా పలు రకాల మోసాలకు పాల్పడేందుకు వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. నకిలీ సర్టిఫికెట్ కావాలంటే రూ.3వేల నుంచి రూ.5వేల వరకు చెల్లిస్తే చాలు అవి లభిస్తున్నాయన్న చర్చ జరుగుతోంది. నగరంలోని కొన్ని జిరాక్స్ సెంటర్లలో వీటిని యథేచ్ఛగా, సులభంగా ప్రింట్ తీసి ఇచ్చే సామర్థ్యం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పంచాయతీలు సకాలంలో పన్నులు వసూలు చేసుకోవాలి

- సరైన మార్గదర్శకాలను రూపొందించాలని పంచాయతీరాజ్‌కు లోకాయుక్త ఆదేశం

కర్నూలు(సెంట్రల్): గ్రామ పంచాయతీలకు సకాలంలో ఆస్తి, ఇతర పన్నులు వసూలు చేసుకోవడానికి సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ఉప లోకాయుక్త పి.రజనీ పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు జిల్లాలోని విట్ విశ్వవిద్యాలయం వెలగపూడి పంచాయతీకి ఆస్తి పన్ను రూపంలో రూ. 25,89,957, ఐనవోలు పంచాయతీకి రూ. 61,71,237, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం నీరు కొండ పంచాయతీకి 83,06,304 ఆస్తి పన్ను బకాయి ఉండేది. మొత్తంగా ఈ రెండు వర్సిటీలు ఆయా పంచాయతీలకు రూ.1,70,67,498 బకాయి ఉండడంతో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కినపాడుకు చెందిన చంద్రశేఖర్ లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ క్రమంలో లోకాయుక్త పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆస్తి పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలని నోటీసులు ఇచ్చింది. లోకాయుక్త ఆదేశాలతో ఆయా సంస్థలు బకాయి ఉన్న ఆస్తి పన్ను చెల్లించినట్లు గురువారం లోకాయుక్తకు పీఆర్ కమిషనర్ నివేదిక సమర్పించారు. ఈ నివేదికను పరిశీలించిన ఉప లోకాయుక్త జస్టిస్‌పి.రజనీ కేసును మూసి వేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, పంచాయతీలకు రావాల్సిన ఆస్తి పన్నును సకాలంలో వసూలు చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హైకోర్టు బెంచ్ సాధన కమిటీ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటు చేస్తామన్న హైకోర్టు బెంచ్ సాధన కోసం కమిటీ ఏర్పాటైంది. గురువారం బార్ అసోసియేషన్ అత్యవసరంగా సమావేశమై హైకోర్టు బెంచ్ సాధన కమిటీని ఏర్పాటుచే సింది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్, వైస్ చైర్మన్‌గా ప్రసాదు, కన్వీనర్‌గా కపిలేశ్వరయ్య, కోకన్వీనర్‌గా దాసెట్టి శ్రీనివాసులు నియమితులయ్యారు. వీరితోపాటు కమిటీ సభ్యులను కూడా నియమించారు. ఈక మిటీ ఆధ్వర్యంలో హైకోర్టు బెంచ్ సాధన కృషి చేస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి తెలిపారు.

వాగు పూడ్చి.. రోడ్డు వేసి!



ఒక చోట అడ్డవాగును పూడ్చిన దృశ్యం



మరో చోట వాగును పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ డీఈఈ నాగన్న

- కంకర ఫ్యాక్టరీ యజమాని నిర్వాకం

పాణ్యం: సహజ సిద్ధంగా నీరు పారే వాగును కంకర ఫ్యాక్టరీ యజమాని పూడ్చేసి తన వాహనాల రాకపోకలకు రోడ్డు వేసుకున్నాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్ డీఈఈ నాగన్న తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో అడ్డవాగు ఉంది. సమీప కొండలపై నుంచి వచ్చే నీరు వాగులో కలుస్తుండటంతో భూగర్భజలాలు పెరిగి చుట్టూ వ్యవసాయ బోర్లలో పుష్కలంగా నీరు లభించేది. అయితే కంకర ఫ్యాక్టరీ యజమాని రవి తన వాహనాల రాకపోకల కోసమని అడ్డవాగును రెండు చోట్ల బండరాళ్లతో పూడ్చివేసి రోడ్డు వేసుకున్నాడు. ఇదే విషయమై గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందడంతో డీఈఈ గురువారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాగును రెండు చోట్ల సుమారు 20 అడుగుల మేర, 4–5 అడుగుల ఎత్తుతో పూడ్చినట్లు గుర్తించారు. వెంటనే తొలగించాలని ఫ్యాక్టరీ యజమానిని ఆదేశించారు. ఆదేశాలను బేఖాతరు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు డీఈఈ తెలిపారు.

ఘాట్‌రోడ్డులో మిర్చి లోడ్ వాహనాలకు అనుమతిలేదు

శ్రీశైలం: శ్రీశైల ఘాట్ రోడ్డులో మిర్చి లోడ్ వాహనాలకు అనుమతిలేదని ఆర్టీఓ ఏఎస్‌కే రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పాదయాత్రికులలను దృష్టిలో ఉంచుకుని హెవీ వెహికల్స్, ఓవర్ లోడ్ వాహనాలను నిషేధించినట్లు తెలిపారు. గురువారం ఆయన ఘాట్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ మిర్చి సీజన్ కావడంతో ప్రస్తుతం ఓవర్ లోడ్‌తో ఇతర జిల్లాలకు లారీల ద్వారా అనుమతిస్తున్నామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఇకపై ఆత్మకూరు – దోర్నాల మార్గంలో ఎలాంటి హెవీ లోడ్ వాహనాలను అనుమతించమన్నారు. కర్నూలు, ఆత్మకూరు నుంచి గాని వెళ్లే మిర్చి, ఇతర కూరగాయల వాహనాలు లోడుకు మించి ఉన్నట్లయితే నంద్యాల చెక్‌పోస్టు నుంచి గిద్దలూరు, మార్కాపురం కుంట జంక్షన్ మీదుగా ఇతర జిల్లాలకు చేరుకోవాలన్నారు. ఆదేశాలలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామన్నారు.

ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోండి

- ఏపీఎంఐపీ అదనపు పీడీ సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రాజాకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో ఉద్యాన శాఖ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోల్డ్ స్టోరేజీ ఉన్న రైతులు సోలార్ రూఫ్‌టాప్ సదుపాయం కల్పించుకోవచ్చని సూచించారు. యూనిట్ కాస్ట్ రూ.35 లక్షలు ఉండగా.. సబ్సిడీ రూ.12.25 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూములు, ప్యాక్‌హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీ, ఉల్లి నిల్వ గోదాములు, సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్స్, సోలార్ పాలీ డ్రైయర్లు వంటి వాటిని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఉద్యానశాఖ సాంకేతిక అధికారి అనూష మాట్లాడుతూ... కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూములకు 75 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఉల్లి నిల్వ గోదాములకు 50 శాతం ఉంటుందన్నారు. ఉద్యాన శాఖ, నాబార్డు, డీఆర్‌డీఏ ద్వారా ఏర్పాటైన అన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఈ పథకాలను వినియోగించుకోవచ్చని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి: రైలు కింద పడి గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంతకల్లు రైల్వే ఎస్ఐ మహేంద్ర తెలిపిన వివరాల మేరకు..దాదాపు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని వ్యక్తి బుధవారం రాత్రి తుగ్గలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆచూకీ తెలిసిన వారు 9866144616ను సంప్రదించాలన్నారు.

మోదీ పాలనలో ఉద్యోగాలు హుష్‌కాకి

- ఏప్రిల్‌లో ఏఐవైఎఫ్ అఖిల భారత మహాసభలు
- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్



సమావేశంలో మాట్లాడుతన్న తిరుమలై రామన్

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశంలో ఏటా 40 లక్షల ఉద్యోగాలు పోతున్నాయని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ విమర్శించారు. గురువారం కర్నూలులో సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తి అవుతోందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు చొప్పున ఇస్తే 22 కోట్ల ఉద్యోగాల్లో యువత ఉండాల్సి ఉందన్నారు. అయితే ఆ పరిస్థితులు కనిపించకపోగా ఉన్న ఉద్యోగాలు కూడా హుషకాకీ అయ్యాయని ఆరోపించారు. , వాటి వివరాలు అడిగితే మతం, కులంపేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో భగత్‌సింగ్ నేషనల్ గ్యారంటీ ఎంప్లాయ్‌మెంట్ పేరతో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఏప్రిల్ నెలలో కర్నూలు ఏఐవైఎఫ్ అఖిల భారత మహాసభలు జరుగుతాయని, వాటిని ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కర్నూలు వచ్చినట్లు ఆయన వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉన్నా ఉద్యోగ కల్పనలో విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్నికల్లో ముఖ్యమైన హామీగా ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఎందుకు విడుదల చేయడంలేదని సీఎం చంద్రబాబునాయుడును ప్రశ్నించారు. అమరావతిని ఫ్రీజోన్ చేసి అన్ని ప్రాంతాల వారికి అక్కడ ఉద్యోగ, ఉపాధి కల్పన చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కారుమంచి, శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

- మృతుల్లో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులు

కర్నూలు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. కర్నూలులో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులు మృతిచెందారు. కర్నూలు బుధవారపేట పెట్రోల్ బంకు ఎదురుగా గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో సత్యనారాయణ (74) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయన కర్నూలు శివారులోని బి.క్యాంప్‌లో నివాసముంటారు. కలెక్టరేట్‌లోని డ్వామాలో ఉద్యోగం చేస్తూ కొన్నేళ్ల క్రితం పదవీ విరమణ చెందారు. మౌర్యా ఇన్ హోటల్ పక్కనున్న చైతన్య కళాశాలలో మనవళ్లు చదువుకుంటుండగా.. వారి ఫీజు చెల్లించి తిరిగి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా వెనుకవైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టి తలపైకి ఎక్కడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రమాద సంఘటనపై వివరాలను సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

బాలాజీ నగర్ దగ్గర...

కర్నూలులోని బాలాజీ నగర్ నరసింహస్వామి ఆర్చి దగ్గర 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కళింగ సురేంద్ర వర్మ (71) మృతిచెందాడు. ఈయన రాయలసీమ ఆల్కలీస్ పరిశ్రమలో పనిచేసి పదవీ విరమణ పొందాడు. కర్నూలు చిత్తారి వీధికి చెందిన ఈయన కొంతకాలంగా సంతోష్ నగర్‌లో కుమారుని దగ్గర ఉంటున్నాడు. బుధవారం రాత్రి బాలాజీ నగర్ నరసింహస్వామి ఆర్చి దగ్గర రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికి వెళ్తూ మృత్యు ఒడికి..

కర్నూలు(రూరల్): ఉల్చాల గ్రామం సుద్దవాగు సమీపాన గురువారం ఉదయం బైక్, ఆటో ఢీకొని బోయ సోమేశ్వరి(28) అనే మహిళ మృతి చెందారు. ఉల్చాల గ్రామానికి చెందిన ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో ఈమె రెండేళ్లుగా నర్సుగా పనిచేస్తున్నారు. బుధవారం నైట్ డ్యూటీ విధులు ముగించుకుని గురువారం ఉదయం సొంత గ్రామమైన ఉల్చాలకు కర్నూలు నుంచి ఆటోలో వస్తున్నారు. ఉల్చాల గ్రామం సుద్ద వాగు సమీపాన ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆటోలో ఉన్న ముగ్గురు ఉపాధ్యాయులకు, ద్విచక్ర వాహనంపై ఉన్న యువకులకు గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న సోమేశ్వరి తీవ్రంగా గాయపడగా కర్నూలు పెద్దాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

యువకుడి దుర్మరణం



వీరేష్ (ఫైల్)

ఆస్పరి: చిగిళి మిట్ట దగ్గర గురువారం రాత్రి బైక్, లారీ ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. బిణిగేరి గ్రామానికి చెందిన చిన్న నాగేష, గోవిందమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు వీరేంద్ర (20) ఆస్పరిలో పత్తి కొనుగోలు చేసే వ్యాపారులు దగ్గర కూలి పనికి వెళ్తుండేవాడు. గురువారం కూడా పని ముగించు కుని స్వగ్రామమైన బిణిగేరికి బైక్‌పై బయలు దేరాడు. ఆదోని నుంచి ఆస్పరి వైపు వస్తున్న లారీ ఢీ కొట్టడంతో వీరేంద్ర అక్కడికక్కడే మృతి చెందా డు. సంఘటన స్థలంలో మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసినట్లు ఆస్పరి సీఐ మస్తాన్‌వలి తెలిపారు. వీరేంద్ర తండ్రి చిన్న నాగేష్ అనారోగ్యంతో పదేళ్ల క్రితం మృతి చెందాడు.

కారు ఢీకొని బాలుడి మృతి

పెద్దకడబూరు: కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనం (టీవీఎస్ ఎక్సెల్)పై వెళ్తున్న బాలుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన హనుమాపురం గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి వివరాల మేరకు.. కొత్తగొల్లల దొడ్డి గ్రామానికి చెందిన చిన్న ఈరన్న కుమారుడు సోమశంకర్ (14) బంధువులను కలిసేందుకు హనుమాపురం వచ్చాడు. తాత బంద రామన్న పొలం దగ్గర ఉన్నడన్న విషయాన్ని తెలుసుకొని ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తెలంగాణ రిజిస్ట్రేషన్ గల కారు ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి వెళ్తోంది. ఆ సమయంలో సోమశంకర్ రోడ్డు క్రాస్ చేయడానికి ప్రయత్నించగా వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి చిన్న ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన సోమశంకర్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్, చిత్రంలో కలెక్టర్ రంజిత్‌బాషా, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తదితరులు

- అధికారులను ఆదేశించిన 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్

కర్నూలు(సెంట్రల్): ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలుపై గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, బి.విరూపాక్షి, కేఈ శ్యామ్‌బాబు, బి.పార్థసారథి, బొగ్గుల దస్తగిరి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ మాట్లాడుతూ.. వికసిత్ కర్నూలు కోసం కృషి చేయాలన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో మిగిలిన 29 లక్షల పనిదినాలను రానున్న 70 రోజుల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన, జల్ జీవన్ మిషన్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పేదలకు నిర్మిస్తున్న గృహ వివరాలను హౌసింగ్ పీడీని అడిగి తెలుసుకున్నారు. కర్నూలులో మిగిలిపోయిన అమృత్-1 పనులు మార్చిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అమృత్-2 కింద కర్నూలు, ఆదోనిలో నీటి సమస్య లేకుండా పనులు చేయాలన్నారు. రేషన్ షాపుల అక్రమాలకు సంబంధించి ఏమైనా కేసులు బుక్ చేశారా, ఎఫ్‌పీ షాపుల పోస్టులు ఖాళీల ఉన్నాయా తదితర వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు.

పాడైన రోడ్లను బాగు చేయండి

ఆలూరు నియోజకవర్గంలో పాడైన పంచాయతీరాజ్ రోడ్లకు మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి కోరారు. చింతకుంట, హొళగుంద–కోవ్వలతోట రోడ్లను బాగు చేయాలని విన్నవించారు. ఆలూరులో 15 రోజుకు ఒక సారి మంచినీరు వస్తోందని, ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. ఎల్లార్తిలో భక్తుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న మల్లికార్జునను తొలగించాలన్నారు. కర్నూలులో సోనామసూరి బియ్యం అధికంగా పండుతుండడంతో హాస్టళ్లకు సన్న బియ్యం మంజూరు చేయాలని సివిల్ సప్లై కార్పొరేషన్ డైరక్టర్ మహేష్‌నాయుడు కోరారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, రాష్ట్ర సివిల్‌సప్లై కార్పొరేషన్ డైరక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కోడుమూరు రూరల్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్‌ను కోరారు. భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కోడుమూరులో చేనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చేనేత కార్మికులు తాము నేసిన పట్టు చీరలను ప్రదర్శించగా 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సమస్యలపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేతల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని అందజేయాలన్నారు. అలాగే చేనేత చీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, ముడి సరుకులపై 50శాతం సబ్సిడీ ఇవ్వాలని, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ ఇవ్వాలని, 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. చేనేత సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ అన్నారు. సౌత్ ఇండియా జౌళీ శాఖ డైరెక్టర్ చంద్రమౌళి, స్థానిక చేనేత కార్మికులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.